బీమా చెక్కు అందజేత



వికారాబాద్, ఫిబ్రవరి 9 : మోమిన్‌పేట మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహ్మద్ జాహుర్ మృతి చెందడంతో రూ.2లక్షల విలువ గల బీమాచెక్కును మాజీ ఎమ్మెల్యే ఆనంద్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఉచిత వైద్య శిబిరం



వికారాబాద్, ఫిబ్రవరి 9 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లిలోని మా శారద దవాఖానలో డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరంలో 170 మందికి పైగా పరీక్షలు నిర్వహించుకోగా, 80 మందికి రక్తపోటు పరీక్షలు 24 మందికి ఎక్స్‌రేలు, మరి కొంతమందికి ఈసీజీలు పరీక్షించినట్లు తెలి పారు.

షీటీమ్స్‌పై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీశైలం

కులకచర్ల, ఫిబ్రవరి 9 : షీటీమ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలపై షీటీమ్స్ పనిచేస్తాయని, మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్వో దేవి, షీటీమ్ పరిగి సబ్ డివిజన్ ఇన్‌చార్జి నర్సింహులు, షీటీమ్ సభ్యులు మనీషా, శోభారాణి, వికారాబాద్ కళాజాత బృంధం సభ్యులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

యాలాల, ఫిబ్రవరి 9: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. మండల పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకొన్న బాధితులకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫోన్లను అప్పగించారు.

ఆటో బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

నవాబుపేట, ఫిబ్రవరి 9: ఆటో, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దాతాపూర్ గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి(45) నవాబుపేట మండలానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో వెంకట్‌రెడ్డికి బలమైన గాయాలు కావడంతో దవాఖానకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందిన్నట్లు నిర్ధారించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి ఆటోను, ద్విచక్ర వాహనాన్ని పోలీస్ స్టేషనుకు తరలించిన్నట్లు పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం వెంకట్ రెడ్డి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ భరత్ భూషన్ తెలిపారు. ఆటో నడుపుతున్న వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని పోలీసులు తెలిపారు. మృతిడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా పూర్తి చేయాలి

- మహాలక్ష్మి దరఖాస్తుల్లో తప్పులను సవరించాలి
- వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 9 : ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కోసం లబ్ధిదారులు అందజేసిన దరఖాస్తుల్లో తప్పిదాలను సవరించేందుకు నియమించిన టీములన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలో అదనపు కలెక్టర్ పర్యటించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పనులను పరిశీలించారు. రూ.500లకే ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రకటించిన పథకాన్ని యాప్‌లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. చేపట్టిన పనుల్లో తప్పులు లేకుండా వేగవంతంగా ఈ నెల 10 వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనులను పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా దరఖాస్తులో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నంబర్, రేషన్ కార్డు నంబర్ తదితర వివరాలను సరిగ్గా పొందు పరచాలన్నారు. అర్హులు నష్టపోకుండా తప్పులను సరి చేయాలని సూచించారు. అన్ని మండలాల పరిధిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారుల నేతృత్వంలో గ్రామ, మునిసిపల్ స్థాయిలో ప్రత్యేక టీమ్‌లు పని చేస్తున్నాయని తెలిపారు.

మహాలక్ష్మి పథకం దరఖాస్తు వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తప్పులు దొర్లకుండా ఇంటింటికీ వెళ్లి పరిశీలించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నాగరాజు, మున్సిపల్ టీపీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

కొడంగల్, ఫిబ్రవరి 9: ఉపాధిహామీ పథకం వలసల నివారణతో పాటు కూలీలకు జీవనోపాధి కల్పించిందని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం 13వ విడుత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరిగింది. మొత్తం రూ.7కోట్లకు సంబంధించిన పనులపై గ్రామ సభలను నిర్వహించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మొత్తం 26 గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన నివేదికను అధికారులు వెల్లడించారు. కూలీలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు గాను ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని, కానీ కొందరు పెడదారిన పట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను సహించేది లేదని, ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమాలకు పాల్పడ్డ వారి ద్వారా రికవరీ చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన మొక్కల పెంపకం కాగితాలపై ఓ విధంగా,

సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

క్షేత్రస్థాయిలో మరో విధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల కూలీలు ఉపాధి పనులు చేపట్టకపోయిన కూలీ డబ్బులను డ్రా చేసుకొన్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఫొటోను మార్ఫింగ్ చేసి ఉపాధి హామీ పథకాన్ని తప్పుదోవ పట్టించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీవో పాండు, ఏపీవో రాములుతో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, ఫిబ్రవరి 9: పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం భవనం వద్ద పీఆర్ టీయూ టీఎస్ పతాకాన్ని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ సంఘానికి సేవలు అందజేసిన వెంకట్‌రెడ్డి, బుగ్గారెడ్డి, చంద్రయ్యలను మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ పరిగి, పూడూరు, దోమ మండలాల నాయకులు కె.శ్రీశైలం, ఎం.శ్రీనివాస్, ఎం.డి. జహంగీర్, అంజిలయ్య, ప్రధానోపాధ్యాయులు రమాపతి, శంకర్, లాల్య, వెంకటేశం, రాష్ట్ర నాయకులు టి.వెంకటయ్య, వై.వీరేశం, జి.గోపాల్, ఎస్.వెంకటయ్య, డి. బుగ్గయ్య, కిష్టయ్య, యోగ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ భవనం ఎదుట ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సంఘం సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. పీఆర్‌టీయూ వికారాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు కె. వి చంద్రశేఖర్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికారాబాద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె. బాబ్యానాయక్, ధారూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బంట్వారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సతీష్. రవి, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. తదనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సంఘ నాయకులకు సన్మానం చేశారు.

వికారాబాద్: విశ్రాంత ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఐఐసీటీని సందర్శించిన విద్యార్థులు



విజిటింగ్‌కు వచ్చిన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్టులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. శుక్రవారం సైన్స్ టూర్‌లో భాగంగా నగరంలోని పలు పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు 200 మందికిపైగా పాల్గొన్నారు. విజిటింగ్‌కు వచ్చిన విద్యార్థులకు ఐఐసీటీ క్యాంపస్ పరిధిలోని కెమికల్ ల్యాబ్‌లతోపాటుగా, సెమియో కెమికల్స్, కెమికల్ ఇంజినీరింగ్, బయోగ్యాస్ ప్లాంట్, ఐఐసీటీ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాజెక్టులపై పరిశోధకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఐసీటీ సైంటిస్టులతో విద్యార్థులకు ప్రత్యేక ఓరియెంటేషన్ సెషన్స్ నిర్వహించారు. కాగా సైన్స్ టూర్లతో విద్యార్థులకు ఈ రంగంలో ఉన్న అవకాశాలు, పరిశోధన ఫలితాలతో పాటు, ఉన్న విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన ఏర్పడుతుందని, విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ దొరుకుతుందని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఫిబ్రవరి 9: ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా అండ్ కంప్యూటర్ అప్లికేషన్ లేదా బ్యాచిలర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ విద్యా అర్హత కలిగి ఉండాలన్నారు. రికార్డ్ అసిస్టెంట్-2, హౌస్ కీపర్-4 పోస్టులకు డిగ్రీ అర్హత, అసిస్టెంట్ లైబ్రరీ-1 పోస్టుకు డిగ్రీ లేదా డిప్లమా ఇన్ లైబ్రరీ సైన్స్ చదివి ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్-6, ల్యాబ్ అటెండెంట్ 5, లైబ్రరీ అటెండెంట్-3 పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. హెవీ వెహికల్ డ్రైవర్-1 పోస్టుకు పదో తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, అలాగే డ్రైవర్-1 పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఐటీఐ ఎలక్ట్రానిక్స్, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణత కలిగిన వారు 1 పోస్ట్ కలిగి ఉన్నందున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు సంబంధించి 18 నుంచి 43 ఏండ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో రెండు జతల దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 17 వరకు తాండూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అందజేయాలన్నారు. ఇతర వివరాల కోసం 9948176126 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి వార్షిక ఉత్సవాలు

ఉత్సవాలకు ముస్తాబైన పరిగిలోని శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం

పరిగి, ఫిబ్రవరి 9 :పట్టణంలోని శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం 20వ వార్షికోత్సవాలు ఈనెల 10, 11వ తేదీల్లో రెండు రోజులపాటు జరుగనున్నాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సాయిబాబా ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై పురవీధుల్లో కొనసాగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 'ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన జరుగుతుంది. ఆదివారం ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు సుప్రభాతము, 7 గంటలకు అభి షేకం, 9 గంటలకు స్వామి వారికి ఉచిత సామూహిక సాయి వ్రతములు, 10 గంటలకు స్వామి వారికి చందనోత్సవం, ఉదయం 11.30 గంటలకు సాయి సేవకులచే సత్సంగం, అనంతరం సాయి సేవక్ సాయి పురోహిత్ చే ప్రసంగ కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పుష్పాభిషేకం, సాయంత్రం 7.15గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఉత్సవాలు విజయవంతం చేయాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సేవలు అభినందనీయం

మండల ఎంపీడీవో లక్ష్మప్పను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెద్దేముల్, ఫిబ్రవరి 9 : గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించారని మండల ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో షేక్ సుష్మా, మండల డిప్యూటీ తహసీల్దార్ కె.మహేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సర్వీసులు రెగ్యులరైజ్ కావడంతో మండలస్థాయి పలువురు అధికా రులను పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ప్రతిరోజూ అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తిస్తూ, ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు కనీస సౌకర్యాల దృష్ట్యా, మౌలిక వసతుల కల్పన దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ కార్యదర్శులు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏవో నజీరొద్దీన్, ఏపీవో నర్సింహులు, ఈసీ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రఘు శేషు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఓయూ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసును ముట్టడిస్తాం'

ఫీజుల పెంపుపై ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థుల నిరసన

ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9 : ఓయూలో ఫీజుల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా పరిశోధన విద్యార్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. వీరికి పలు విద్యార్థి సంఘాల నాయకులు, పీజీ విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఓయూలో ఫీజుల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. అదేవిధంగా ప్రైవేటు రీ సెర్చ్ సెంటర్ల వల్ల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని, భోజనం, వసతి సౌకర్యం అందరికీ కల్పించాలని, యూజీసీ నుంచి ఏ ఇతర ఫెలోషిప్ రాని పరిశోధక విద్యార్థులకు 25వేల ఫెలోషిప్ ఇవ్వాలని కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీ సెర్చ్ స్కాలర్స్ రహీం, కిరణ్, ఆంజనేయులు, స్వరాజ్, రాము, వినయ్, దశరథ్, అంజన్ బాబు, రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే 235 వాహనాలకు వేలం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న 235 ద్వి, త్రి చక్ర వాహనాలకు ఆరు నెలల్లో వేలం వేయనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు సంబంధిత పత్రాలతో అంబర్‌పేట్‌లోని కార్ (సిటీ ఆర్మూడ్ రిజర్వు ఫోర్స్) హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదించాలని సూచించారు.
వాహనాల వివరాలు www.rachakondapolice.telangana.gov.in (సిటిజన్ సర్వీసెస్ అంబాడెడ్ వాహనాలు-2024) వెబ్‌సైట్‌లో అందుబాటు లో ఉంటాయని, ఇతర వివరాలకు 87126 62661, 80083 38535 సంప్రదించవచ్చని సూచించారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

యాలాల, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ పరిసర సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ శంకర్ సిబ్బందితో కలసి శుక్రవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 14,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
★I, N KEERTHI, D/o. N Ram Chandra Reddy, R/o. 7-2-46, Kothagadi, PO: Vikarabad, Dist: Vikarabad, Telangana-501 101, declare that N KEERTHI and KEERTHI NARAYANGARI both Names belongs to same person for Passport purpose only.
NT-10108
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేటి నుంచి ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ మహాసభ

మహాసభ వివరాలను వెల్లడిస్తున్న సంఘం నాయకులు మోహన్‌శర్మ, మహ్మద్ షమీముల్లా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడేందుకు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ మహాసభను నిర్వహిస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్‌శర్మ, ఉప ప్రధాన కార్యదర్శి మహ్మద్ షమీముల్లా తెలిపారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లోని జీటీఎస్ కాలనీలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న మహాసభకు విద్యుత్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

పరిగి టౌన్, ఫిబ్రవరి 9 : తాండురుకు చెందిన అబ్దుల్ రజాక్ (32) బైక్‌పై పూడురుకు వెళ్తుండగా పరిగి సమీపంలోని 220/130 కేవీ సబ్‌స్టేషన్ దగ్గర బైక్ అదుపుతప్పి కిందపడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కిష్టంపల్లి తండాలో డెంగీ కేసు

కులకచర్ల, ఫిబ్రవరి 9 : చౌడాపూర్ మండల పరిధిలోని కిష్టంపల్లి తండాలో డెంగీ జ్వరం వచ్చిన వ్యక్తి ఇంటిని వైద్యులు సంద ర్శించి యాంటి లార్వా ఆపరేషన్ చేపట్టారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది గ్రామస్తులకు వివరించారు. వైద్యులు ప్రతి ఇల్లూ తిరిగి దోమ లార్వాలు ఉన్నటువంటి నీటిని తొలగించారు. ఎవరికైన జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రాములు, హెల్త్‌అసిస్టెంట్ శరభలింగం, ఏఎన్ఎం ఇందిర, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి/తాండూర్/కొడంగల్/ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668
: 80966 77962